క్లుప్తంగా

డబుల్‌బెడ్ రూం ఇళ్లను ఖాళీ చేయించాలి

జడ్చర్ల: బాదేపల్లి ఎర్రగుట్ట ప్రాంతంలో అనధికారికంగా డబుల్‌బెడ్‌రూం ఇళ్లల్లో నివాసం ఉంటున్న వారిని ఖాళీ చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దాదాపు 560 డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించగా ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్ నాయకులు ఒక్కో ఇంటికి రూ.2 లక్షలు వసూలు చేసి అనర్హులకు ఇళ్లు కేటాయించారని ఆరోపించారు. దీంతో అర్హులయిన నిరుపేదలు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్న క్రమంలో ఈ అవినీతి బాగోతం బయటకు వచ్చిందన్నారు. వెంటనే రెవెన్యూ, మున్సిపాలిటీ, పోలీసు శాఖలు సమన్వయంగా పనిచేసి అనర్హులను ఖాళీ చేయించి అర్హులకు న్యాయం చేయాలని కోరారు. కాగా ఇళ్ల కోసం దళారులకు డబ్బులు ఇచ్చిన వారు తమ సొమ్మును తిరిగి రాబట్టుకోవాలని సూచించారు. వారు డబ్బులు ఇవ్వకుంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. జడ్చర్ల పట్టణంలో అదనంగా మరో వెయ్యి ఇందిరమ్మ ఇళ్ల నిర్మిస్తామన్నారు.

దేవరకద్ర కమిషనర్‌గా నరేష్‌బాబు



దేవరకద్ర: స్థానిక మున్సిపాలిటీ కొత్త కమిషనర్‌గా నరేష్‌బాబు గురువారం బాధ్యతలు తీసుకున్నారు. దేవరకద్ర కొత్త మున్సిపాలిటీగా ఏర్పడిన తరువాత ఇన్‌చార్జీ కమిషనర్‌గా జడ్చర్ల కమిషనర్ లక్ష్మారెడ్డిని నియమించారు. ప్రస్తుతం నరేష్‌బాబును ప్రభుత్వం పూర్తి స్థాయి కమిషనర్ నియమించింది.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

మున్సిపాలిటీ పరిధిలోని మీనుగోనిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను కమిషనర్ నరేష్ బాబు పరిశీలించారు. ఆయనతో పాటు మేనేజర్ సీత్యానాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగా టీషర్టుల వితరణ



మహబూబ్‌నగర్ క్రీడలు: ఎనుగొండలోని అనాథ శరణాలయంలో విద్యార్థులకు గురువారం జిల్లా కేంద్రానికి చెందిన ఆకారపు రాజగోపాల్, ఆకారపు నరేందర్ యోగా టీషర్టులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.సాయికుమార్, కోశాధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

29న వీరశైవ సమాజం సమావేశం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక తువ్వగుట్టలోని బసవ భవన్‌లో ఈనెల 29వ తేదీ ఉదయం 10:30 గంటలకు పట్టణ వీరశైవ సమాజం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సంఘం గౌరవాధ్యక్షుడు వజ్రలింగం, అధ్యక్షుడు పోకల శివుడు, ప్రధాన కార్యదర్శి ఆవిటి శంకర్‌లింగం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సభ్యులందరూ తప్పక హాజరుకావాలని వారు విజ్ఞప్తి చేశారు.

ప్రధాన కార్యదర్శిగా రంగభానుప్రకాష్

జడ్చర్ల టౌన్: భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధ సంస్థ భారతీయ జీవిత బీమా ఏజెంట్స్ సంఘ్ హైదరాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన రంగ భానుప్రకాష్‌ను నియమించినట్లు ఆ సంఘ అఖిల భారత డిప్యూటీ కార్యదర్శి ఫణీంద్రకుమార్ తెలిపారు. గురువారం పట్టణంలో జరిగిన సంఘ సమావేశంలో ఆయన ఎన్నికను ప్రకటించారు. పట్టణానికే చెందిన పొద్దుటూరి నళినికాంత్‌ను సౌత్‌సెంట్రల్ జోన్ కార్యవర్గ సభ్యుడిగా ఎంపిక చేశారు. వీరితో పాటు ఏడుగురు సభ్యులతో కూడిన బ్రాంచ్ అడ్‌హక్ కమిటీని నియమించారు. కార్యక్రమంలో సంఘ అఖిల భారత కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, సౌత్ సెంట్రల్ జోన్ సెక్రెటరీ భాస్కర్‌రెడ్డి, హైదరాబాద్ డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి బాలస్వామి, ఉపాధ్యక్షుడు చంద్రమోహన్, సభ్యులు బండి కిరణ్‌కుమార్, రంగరాములు పాల్గొన్నారు.

నేడు లయన్స్ సేవాకేంద్రం ప్రారంభం

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని సిగ్నల్ గడ్డ వద్ద రెన్నోవేషన్ చేసిన లయన్స్‌క్లబ్ సేవాకేంద్రాన్ని శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు కైలాశ్ జవహార్ తెలియజేశారు. కార్యక్రమానికి లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్లు కోటేశ్వర్‌రావు, మహేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, మార్కెట్ చైర్‌పర్సన్ జ్యోతి హాజరవుతారని తెలిపారు.



దేవరకద్రలో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే జి.మధుసూధన్‌రెడ్డి



జడ్చర్లలో ర్యాలీ చేస్తున్న అధికారులు

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

సాక్షి, నెట్‌వర్క్: మత్తు రహిత సమాజాన్ని నిర్మించేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, జనంపల్లి అనిరుధ్ రెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం అధికారులు, ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పిస్తూ జిల్లావ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దేశ భవిష్యత్ విద్యార్థుల చేతిలో ఉందని, మత్తుకు బానిస కాకుండా ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలని కోరారు.

- దేవరకద్ర నియోజకవర్గకేంద్రంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులతో పాటు ఎక్సైజ్, మండల అధికారులు మార్కెట్ యార్డు నుంచి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ రామకృష్ణ, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంఈఓ బలరాం, మార్కెట్ చైర్మన్ కతలప్ప, టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అరవింద్‌రెడ్డి, అంజిల్‌రెడ్డి, హన్మంతరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- రాజాపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ రహదారిపై ఉన్న హోటల్స్, టీస్టాల్స్ వద్ద గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారం వస్తుందని, అలాంటి వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రాజాపూర్‌లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఎన్‌బీ రత్నం, సీఐ నాగార్జునగౌడ్, ఎస్ఐ శివానందం, ఎంఈఓ సుధాకర్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.
- జడ్చర్ల పట్టణంలో మహిళా శిశుసంక్షేమ శాఖ, వయోవృద్ధులు, దివ్యాంగుల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నషాముక్త్ భారత్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాదేపల్లి బాలుర జెడ్పీ హైస్కూల్ నుంచి ప్రధాన రోడ్డు గుండా ర్యాలీ కొనసాగించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నర్సింగ్‌రావు, ఎంఈఓ మంజులాదేవి, మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ, సీడీపీఓ శోభారాణి, ఎక్సైజ్ సీఐ విప్లవరెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సుగుణమ్మ, సునీత, కల్పన, నాగేంద్రమ్మ, రాజ్యలక్ష్మి, అనిత, సావిత్రి, అనసూయ, అంగన్‌వాడి టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.
- హన్వాడ మండల కేంద్రంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ చేపట్టి డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.
- కోయిల్‌కొండ మండల కేంద్రంలోని శ్రీవీరభద్ర పాఠశాలలో ఎస్ఐ తిరుపాజీ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా పాఠశాలలో సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల నియంత్రణపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని పాత పోలీస్‌స్టేషన్ ప్రాంతంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాజేష్, ఉపాధ్యాయులు నర్సిములు తదితరులు పాల్గొన్నారు.



రాజాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తదితరులు

డ్రగ్స్‌తో జీవితం విచ్ఛిన్నం

మహబూబ్‌నగర్ క్రైం: యువతకు మత్తు పదార్థాలు ఎంతో సులభంగా అందుబాటులోకి వచ్చాయని, వీటి వాడకం వల్ల ఆరోగ్యంతో పాటు కుటుంబం కూడా తీవ్రంగా ప్రభావితం అవుతుందని ఎస్‌వీఎస్ ఆస్పత్రి మానసిక ఆరోగ్య విభాగ అధిపతి డాక్టర్ అశోక్‌రెడ్డి అన్నారు. గురువారం ఆస్పత్రిలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎండీ డాక్టర్ కేజే రెడ్డి, ఆస్పత్రి రెసిడెంట్ డైరెక్టర్ రాంరెడ్డి, ప్రిన్సిపాల్ జోషి, డాక్టర్ వెంకట్‌రాహుల్ ఇతర వైద్యుల పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ జానకి



హన్వాడలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



కోయిల్‌కొండలో..

మత్తుతో మానసిక కుంగుబాటు



వాగ్దేవి కళాశాలతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఈశ్వరయ్య

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: యువత మాదక ద్రవ్యాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి ఈశ్వరయ్య సూచించారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలతో యువత భవిష్యత్ నాశనం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రవీందర్‌నాయక్, మల్లారెడ్డి, కళాశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపాల్ గీతాదేవి పాల్గొన్నారు.

యువత మాదకద్రవ్యాలను దూరంగా ఉండాలని ఎస్పీ జానకి సూచించారు. ఈమేరకు జేపీఎన్‌సీ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వినియోగించడం వల్ల యువత ఆరోగ్యపరంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. మాదకద్రవ్యాలు అమ్మినా, ప్రేరేపించినా 87126 71111 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో చైర్మన్ రవికుమార్, డీబ్ల్యూఓ జరీనాబేగం, డీఎస్పీ వెంకటేశ్వర్లు, రూరల్ సీఐ గాంధీనాయక్, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, కంట్రోలర్ సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'కళాభవన్‌లో ఉర్దూ ఘర్ నిర్మించొద్దు'

మహబూబ్‌నగర్ రూరల్: మహబూబ్‌నగర్ పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాభవన్ ప్రాంగణంలో ఉర్దూ ఘర్ నిర్మాణం చేపట్టకూడదని దళిత సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ముస్లిం వర్గాలతో అంబేడ్కర్ కళా భవనంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామని, దీనిని దృష్టిలో ఉంచుకొని దళిత సంఘాలకు న్యాయం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు రమేష్, మల్లెపోగు శ్రీనివాస్, కృష్ణయ్య, సింగిరెడ్డి పరమేశ్వర్, కానుగడ్డ యాదయ్య, రాజ్‌భాయ్, కాలె నరేందర్, ప్రవీణ్‌కుమార్, నర్సిములు, మాణిక్యంరాజు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

పేదల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

చిన్నచింతకుంట: పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం చిన్నచింతకుంట మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఎంఎస్ గార్డెన్‌లో లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదలకు సంక్షేమం కోసం ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత కరెంట్, సబ్సిడీపై సిలిండర్, సన్నబియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలను విస్మరించిందని ఆరోపించారు. దేవరకద్ర నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు కాగా.. చిన్నచింతకుంట మండలానికి 503 ఇళ్లు కేటాయించామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, దేవరకద్ర నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వెంకటేష్, జిల్లా హౌజింగ్ పీడీ భాస్కర్, కురుమూర్తిస్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు జీజీ పాల్, మహిమూద్, గంజి బాల్‌రాజు, ప్రతాప్, వట్టెం శివకుమార్, ఎస్ శేఖర్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న భాస్కర్‌యాదవ్

అడ్డాకుల: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త గజ్జి భాస్కర్‌యాదవ్ కార్యకర్తలకు సూచించారు. అడ్డాకుల, మూసాపేట మండల కేంద్రాల్లో గురువారం జరిగిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగా లేకున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నెరవేరుస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందుతున్న వారు ముఖ్యమంత్రికి అండగా ఉండాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసిన వారికి తప్పకుండా పదవులు లభిస్తాయని భరోసానిచ్చారు. కొత్త, పాత నాయకులు సమన్వయంతో ముందుకు సాగాలని, ఐకమత్యంతో పని చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకునే విధంగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శెట్టి శేఖర్, తోట శ్రీహరి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, రామన్‌గౌడ్, నాగార్జున్‌రెడ్డి, విజయమోహన్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, కృష్ణయ్య, సీజీ.గోవర్ధన్, పటేల్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల హక్కుల కోసం కలిసి పోరాడుదాం



మాట్లాడుతున్న ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నరేంద్రచారి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలో పాత్రికేయులకు ఇళ్లు సాధించేందుకు ఐక్య పోరాటమే సమంజసమని జర్నలిస్టులు ముక్తకంఠంతో తెలిపారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని మూడు రోజులుగా స్థానిక ధర్నాచౌక్‌లో టీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడు వాకిటి అశోక్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్ష గురువారం కొనసాగింది. నాలుగో రోజు ప్రెస్ క్లబ్ కమిటీతో పాటు ప్రధాన పత్రికల బ్యూరోలు, టీవీ ఛానళ్ల బ్యూరోలు, సోషల్ మీడియా జర్నలిస్టులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నరేందర్‌చారి మాట్లాడుతూ టీడబ్ల్యూజేఎఫ్ చేపట్టిన దీక్షలకు మద్దతు తెలపడంతో పాటు భవిష్యత్ కార్యచరణలో భాగస్వామ్యం అవుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి నరేందర్‌గౌడ్, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి విజయకుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొహమ్మద్ రఫీ, బీసీ జేఏసీ నాయకుడు మైత్రి యాదయ్య, ఉమామహేశ్వరరావు, కార్యదర్శి గోపాల్, జర్నలిస్టు ప్రతినిధులు శ్రీనివాస్, రవీందర్, గోపాల్, గోపాలకష్ణ, పల్లెమొని యాదయ్య, మోహన్‌దాస్, భాస్కరాచారి, సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్, రాము, మాల చైతన్య సంఘం మూలె కేశవులు తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

నవాబుపేట: ఇంటి విషయంలో దాయాదుల మధ్య జరిగిన గొడవలో దాడి చేశారని బాధితురాలు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపాడు. మండలంలోని యన్మన్‌గండ్లకు చెందిన కోస్గి పద్మమ్మ, కోస్గి నర్సింహులు మధ్య ఇంటి పంపకాల నేపథ్యంలో తరుచూ గొడవలు జరుగుతుండేవి. గురువారం మరోమారు గొడవ జరగడంతో నర్సింహులు తనతో పాటు భర్తపై దాడి చేశాడని కోస్గి పద్మమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయంలో నర్సింహులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దుస్తుల పంపిణీ

గండేడ్: మండలంలోని రుసుంపల్లికి చెందిన ఎన్ఆర్ఐ నరోత్తంరెడ్డి పంపిన దుస్తులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి పంచాయతీ కార్మికులకు అందజేశారు.

ప్రభుత్వ ఉద్యోగి కుమార్తె సర్కార్ బడికి..



కుమార్తెను ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్న జూనియర్ అసిస్టెంట్ సుదర్శన్

గండేడ్: ప్రభుత్వ ఉద్యోగి తన కుమార్తెను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి నిబద్ధత చాటుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. గండేడ్ మండల కేంద్రానికి చెందిన సుదర్శన్ స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సుదర్శన్ పెద్ద కుమార్తె మనస్విని ఐదో తరగతి వరకు గ్రామంలోని మాస్టర్ మైండ్, ఏవీఆర్ పాఠశాలలో చదివించాడు. అనంతరం ఈ ఏడాది ఆరో తరగతి చదివేందుకు కుమార్తెను ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో చేర్పించేందుకు టీసీ, బోనఫైడ్ తదితర ధ్రువీకరణ పత్రాలను ఇన్‌చార్జ్ హెచ్‌ఎం జనార్దన్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని, తన ముగ్గురు అన్నదమ్ములు కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివి ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నామని గర్వంగా చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డి ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యమవుదాం

నారాయణపేట: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని తపస్ జిల్లా అధ్యక్షుడు షేర్ కృష్ణారెడ్డి అన్నారు. తన కుమారుడు గురుచరణ్ రెడ్డి జన్మదిన సందర్భంగా గురువారం వివిధ పాఠశాలలకు మొక్కలు పంపిణీ చేశారు. మండలంలోని జాజాపూర్ జెడ్పీ, ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటి మొక్కల ప్రాధాన్యత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు తమ పుట్టిన రోజున ఒక మొక్క నాటాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి నరసింహ, డీఎస్ఓ భాను ప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జాజాపూర్ పాఠశాలలో విద్యార్థులకు మొక్కలు అందిస్తున్న షేర్ కృష్ణారెడ్డి

పశువైద్యం.. బహుదూరం

- 7 ఆస్పత్రులకు ఒక్కరే డాక్టర్

నవాబుపేట: జిల్లా కేంద్రానికి అతి సమీపంలో ఉన్న మండలానికి పశువైద్యం అందని ద్రాక్షే అయ్యింది. మండలంలో మొత్తం రెండు ప్రధాన ఆస్పత్రులతో పాటు 7 పశువైద్య ఉపకేంద్రాలు ఉన్నాయి. వీటిలో కేవలం ఒక్క డాక్టర్ మాత్రమే అందుబాటులో ఉండటం విడ్డూరం. ఒక డాక్టర్ పోస్టుతో పాటు 7 కంపౌండర్, 3 ఎల్ఎఫ్ఎల్, 4 ఇతర ఇబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నవాబ్‌పేట పశు వైద్యశాలలో ఒక వైద్యుడు ఉండగా.. కాకర్లపహడ్, కారుకొండ, ఇప్పటూర్, లింగంపల్లి, పోమాల్, చౌడూర్ సబ్ సెంటర్లలో కంపౌండర్లు సైతం లేరు. కేవలం ఇద్దరు కంపౌండర్లతోనే మండలం మొత్తం పశువైద్యం కొనసాగుతుంది.

మండలవ్యాప్తంగా..

మండలంలో 54 పంచాయతీలు, 27 గిరిజనతండాలతో పాటు మరో 10 మదిర గ్రామాలు ఉంటాయి. ఇప్పుడిప్పుడే మండలం పాడి రంగంలో అభివృద్ధి చెందుతున్న తరుణంలో పశు వైద్యం ఆందోళన కలిగిస్తుంది. పశువులకు ఏదైనా రోగం సంభవిస్తే కంపౌండర్ చేసిన వైద్యంతో నయమైతే సరి, లేదంటే రైతులు ఆ పశువుపై ఆశ వదులుకోవాల్సిందే. ఆస్పత్రుల్లో సైతం సరిగ్గా మందులు లేకపోవటం రూ.వేలు ఖర్చు పెట్టి ప్రైవేట్ మందుల దుకాణాలను ఆశ్రయించాల్సి వస్తోందని పాడి రైతులు వాపోతున్నారు.

రెండు రోజులుగా తాళం

మండలంలోని కొల్లూర్ పశు వైద్యశాల రెండు రోజులుగా తాళం వేసి ఉండటంతో స్థానిక పాడిరైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వైద్యాధికారి అందుబాటులో ఉండే ఆస్పత్రిలో కనీసం సిబ్బంది కరువయ్యారని ఆవేదన చెందుతున్నారు.



నవాబుపేట మండలం కొల్లూర్‌లో తాళం వేసి ఉన్న పశువైద్యశాల

కంపౌండరే.. డాక్టర్



కంపౌండరే మాకు డాక్టర్. పశువుకు ఏదైనా రోగం వస్తే కంపౌండర్ చెసిందే వైద్యం. కంపౌండర్ వచ్చినపుడే ఆస్పత్రి తెరుస్తారు. మండల కేంద్రంలోనైనా డాక్టర్ అందుబాటులో ఉంటే ఎలాగైన కాలం గడిపేవాళ్లం. అది కూడా కరువైంది. పశువుకు డాక్టర్‌తో వైద్యం చేయించాలంటే ప్రత్యేక వాహనంలో డాక్టర్ ఉన్న చోటుకు పశువును తీసుకుని వెళ్లాల్సిందే.

– నాగరాజ్, నవాబుపేట

మంత్రి, ఎమ్మెల్యే దృష్టికి..



పశువైద్యానికి సంబంధించి ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో పాటు సంబంధిత మంత్రి శ్రీహరితో సైతం మాట్లాడి పశు వైద్య. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా చూస్తాం. గతంలో ఇద్దరు డాక్టర్లు ఉండేవారు. సిబ్బందిని అవసరాన్ని మంత్రికి వివరిస్తాం.

– లింగం, మార్కెట్ కమిటీ చైర్మన్, నవాబుపేట

సేవలు అందిస్తున్నాం

ఉన్న సిబ్బందితో రైతులకు సేవలు అందిస్తున్నాం. పశువులకు రోగం వస్తే రైతుల పొలాలకు సైతం సిబ్బందిని పంపిస్తున్నాం. ఏడాది కాలంగా మండలంలో ఒక్క డాక్టరే అందుబాటులో ఉన్నారు. రెండేళ్లుగా కొల్లూర్ ఆస్పత్రిలో డాక్టర్ పోస్టు ఖాళీగానే ఉంది. అవసరాన్ని బట్టి నేను లేదా సిబ్బంది అక్కడికి వెళ్తుంటాం. మండలంలో డాక్టర్ లేకున్నా మిగతా సిబ్బంది అందుబాటులో ఉంటే చాలా వరకు రైతులకు ఇబ్బందులు రాకుండా చూసుకుంటాం.

– దివ్యభారతి, మండల పశువైద్యాధికారి